

అనివేటి మండపం
పూర్తయ్యేదెన్నడో?
- గత ప్రభుత్వ హయాంలో రూ.50 లక్షలు మంజూరు
- ప్రారంభించి తొమ్మిది నెలలైనా నేటికీ స్లాబ్ దశలోనే పనులు

6

కమనీయం రాములోరి కల్యాణం

సిద్దిపేట కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట సుభాష్‌రోడ్డులోని హనుమాన్ ఆలయం వద్ద బుధవారం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠ జరిగిన రోజును పురస్కరించుకుని రాములవారి కల్యాణం జరిపించారు. ఈ కల్యాణ మహోత్సవంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ అయోధ్య బాలరాముని ప్రతిష్ఠ జరిగిన సుదినాన సిద్దిపేటలో సీతారామచంద్రుల కల్యాణం నిర్వహించటం ఎంతో పుణ్యంగా భావిస్తున్నట్లు చెప్పారు. శ్రీరామచంద్రమూర్తి దయతో ప్రజలంతా ఆయురారోగ్యలతో ఉండాలని, అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. కల్యాణ మహోత్సవం ఏర్పాటు చేసిన నిర్వాహకులను హరీశ్‌రావు అభినందించారు.



కల్యాణ మహోత్సవంలో హరీశ్‌రావు



కల్యాణానికి హాజరైన భక్తులు

సంగారెడ్డి ఫతేఖాన్ దర్గా 140వ ఉర్సులో జగ్గారెడ్డి

- ప్రతీ సంవత్సరం ఉర్సుకు వస్తున్నాను : టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి





సంగారెడ్డిలోని ఫతేఖాన్ దర్గాలో గంధం ఎత్తుకుని వస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రార్థనలు చేస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని హజ్రత్ ఫతేఖాన్ సాబ్రీ మజ్జుబ్ రహేమతుల్లా(ఫతేఖాన్) దర్గా 140వ ఉర్సు ఉత్సవాల్లో బుధవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. దర్గాలోకి గంధం ఎత్తుకుని వెళ్లి చాదర్ కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఉర్సులో ప్రత్యేక ప్రార్థనలు చేయడం వల్ల ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందన్నారు. తాను ప్రతీ సంవత్సరం ఉర్సుకు హాజరవుతున్నానని పేర్కొన్నారు. దర్గా అభివృద్ధి కోసం కృషి చేస్తానని జగ్గారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోష్‌కుమార్, కౌన్సిలర్లు షఫీ, సోహైల్ అలీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

కంది/సంగారెడ్డి జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. బుధవారం ఆమె సంగారెడ్డి టౌన్‌తో పాటు కంది మండంలోని కవలంపేటలో, కొండాపూర్ మండలంలోని గంగారంలో నిర్వహించిన గ్రామసభలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.



సంగారెడ్డిలోని రాంనగర్ గ్రామసభలో మహిళలతో కరచాలనం చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్



మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామసభలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట

రెండో రోజూ అదే తీరు

- రసాభాసగా గ్రామ, వార్డు సభలు
- పలుచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య వాగ్వాదం
- మద్దూరు మండలంలో తోపులాట, దాడులు చేసుకున్న ఇరువర్గాలు
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన గొడవలు

సిద్దిపేటటౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన గ్రామ, వార్డు సభలు రెండోరోజూ కూడా నిలదీతలు.. నిరసనలు, వాగ్వాదాల మధ్య కొనసాగాయి. బుధవారం ఆయా సభల్లో పలు పథకాలకు అర్హులను ఎంపిక చేసిన పేర్లను చదవగా కొన్నిచోట్ల నిరసనలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగి కుటుంబసభ్యులకు పథకాలలో ఎలా అవకాశమిస్తారంటూ స్థానికులు అధికారులను నిలదీశారు.

ప్రజాపాలన దరఖాస్తులేమయ్యాయి

ప్రజాపాలనలో రేషన్‌కార్డు కోసం చేసుకున్న దరఖాస్తులు ఏమయ్యాయంటూ అధికారులను వార్డు సభలో పలువురు నిలదీశారు. తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటే జిరాక్స్‌లకు రాను, పోను వాహనాలకు పెట్రోల్ ఖర్చు లు అవుతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో అందించిన దరఖాస్తులు ఉన్నాయని, రేషన్‌కార్డు లిస్టులో పేరులేని వారు ఇదే గ్రామ, వార్డు సభలో దరఖాస్తులు అందించాలని అధికారులు ప్రజలకు సూచించారు. చేసేది లేక జిల్లాలో చాలా చోట్ల దరఖాస్తులను అందించారు.

రైతు రుణమాఫీ ఎప్పుడు చేస్తారు

జిల్లాలో చాలా సభల్లో రైతులకు రూ.2లక్షల వరకు చేస్తామన్న రుణమాఫీ ఎమైందంటూ రైతులు అధికారులను నిలదీశారు. రూ. 40వేల రుణమాఫీ కూడా జరగలేదనిపలువురు రైతులు అధికారుల ముందు వాపోయారు. అర్హులైన వారికి త్వరగా రుణమాఫీ జరిగేలా చర్యలు చేపట్టాలని వేడుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఆయా పార్టీ నాయకులు, కార్యకర్తలకు కాకుండా గ్రామాల్లో, పట్టణాల్లో పేద ప్రజలకు అర్హులైన వారిని గుర్తించి వారందరికీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల పరస్పర దాడులు

మద్దూరు మండలం, నర్సాయపల్లిలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సభ గందరగోళంగా మారింది. నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడాలని చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి కోరారు. తమకు మాట్లాడే అవకాశమివ్వాలంటూ బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి తన అనుయాయులతో స్టేజీ వద్దకు దూసుకెళ్లారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. చేర్యాల సీఐ ఎల్.శ్రీను ఆధ్వర్యంలో పోలీసులు ఇరువురిని

మిగతా 6వ పేజీలో...

ఆస్తి పన్ను కట్టేద్దామా..

మున్సిపాలిటీలకు ప్రధాన ఆదాయ వనరుల్లో ఆస్తిపన్ను ఒకటి. అలాంటి ఆదాయాన్ని వంద శాతం వసూలు చేసేందుకు జిల్లాలోని ఆయా మున్సిపాలిటీ అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను రూ.28.52 కోట్లుండగా, ఇప్పటివరకు రూ.15.33 కోట్లు వసూలు చేశారు. గతేడాది సిద్దిపేట మున్సిపల్ ఆస్తి పన్ను వసూళ్లతో రాష్ట్రంలో మూడోస్థానంలో నిలిచింది. ఇక ఈ ఏడాది రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి అన్ని మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలవాలని కసరత్తు చేస్తుంది. అందులో భాగంగానే ప్రతిరోజు చెత్తసేకరణకు వచ్చే వాహనానికి ఆస్తి పన్ను చెల్లింపుపై మైక్ సౌండ్ ద్వారా ఇంటి యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు.

- జిల్లాలో ఐదు మున్సిపాలిటీల పరిధుల్లో 67,980 ఇళ్లు
- వాటి ఆస్తి పన్ను మొత్తంగా రూ. 28.52 కోట్లు
- ఇప్పటివరకు రూ. 15.33 కోట్లు వసూలు
- వంద శాతం రాబట్టడమే లక్ష్యం
- మే 31లోపు వసూలుకు అధికారుల కసరత్తు



సిద్దిపేటటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల ఐదు మున్సిపాలిటీలున్నాయి. వీటిలో సిద్దిపేటలో 36,921, గజ్వేల్‌లో 12,399, హుస్నాబాద్‌లో 7,300, దుబ్బాకలో 6,202, చేర్యాలలో 5158 మొత్తంగా 67,980 నివాస గృహాలున్నాయి. గతేడాది ఐదు మున్సిపాలిటీల్లో 63,755 నివాసాలుండగా (కమర్షియల్, నాన్ కమర్షియల్) ఈ ఏడాది 4,225 నివాస గృహాలు పెరిగాయి. దీంతో గతేడాది కన్నా ఎక్కువగా ఆస్తి పన్ను మున్సిపాలిటీలకు రానున్నది. కాగా ఆస్తి పన్నును వసూలు చేసేలా సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆశ్రిత్ కుమార్‌తో కలిసి అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మున్సిపల్ రెవెన్యూ అధికారులు, బిల్లు కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు మున్సిపల్ రెవెన్యూ అధికారులు లక్ష్యాన్ని చేరుకునేలా కృషి చేస్తున్నారు.



లక్ష్యం దిశగా..

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో మొత్తంగా రూ.28,52,77,000లు ఆస్తి పన్ను వసూలు చేసేలా ఆయా మున్సిపల్ కమిషనర్లు, అధికారులు కార్యాచరణ రూపొందించుకున్నారు. వీటిలో సిద్దిపేట మున్సిపల్ రూ.18,17,75,000, గజ్వేల్ మున్సిపల్ రూ.4,15,00,000, దుబ్బాక మున్సిపల్ రూ.2,04,53,000, చేర్యాల రూ.3,14,43,000, హుస్నాబాద్ 1,00,30,000 టార్గెట్‌గా పెట్టుకున్నారు. వీటిలో సిద్దిపేట మున్సిపల్ రూ. 10,27,82,000, గజ్వేల్ 2,21,46,000, దుబ్బాక రూ. 95,66,000, చేర్యాల రూ.1,28,19,000, హుస్నాబాద్ రూ.60లక్షల లోపు వసూలు చేశారు. నిర్ణీత గడువు మార్చి 31లోపు అనుకున్న లక్ష్యం దిశగా వసూలు చేయనున్నారు.

గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ఏర్పడటంతో ఆదాయం సమకూర్చుకునేందుకు గానూ మున్సిపల్ పరిధిలోని ఆస్తి పన్ను వసూళ్లు చేయడంలో రాష్ట్రంలోనే సిద్దిపేట మున్సిపాలిటీ మూడో స్థానం దక్కించుకుంది. ప్రభుత్వం ప్రకటించిన ఆఫర్‌ను జిల్లాలోని గృహ యజమానులు అవకాశాన్ని అందిపుచ్చుకోవడంతో వారిపై భారం కూడా తగ్గినట్లుయ్యింది. దీంతో సిద్దిపేట మున్సిపాలిటీ గతేడాది మార్చి 30 నాటికి 93 శాతం మేర పన్నును వసూలు చేసింది. ఈ ఏడాది వంద శాతం ఆస్తి పన్నును వసూలు చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షిస్తున్నది.

పట్టణ అభివృద్ధికి సహకరించాలి



సిద్దిపేట మున్సిపల్ దేశంలో, రాష్ట్రంలో అన్నింటా ఆదర్శంగా ఉంది. ఆస్తి పన్నులో కూడా ముందుండేలా ప్రజలు సహకరించి సకాలంలో పన్ను చెల్లించాలి. ఆస్తి పన్ను సకాలంలో చెల్లించడం ద్వారా పట్టణ అభివృద్ధికి సహకరించినవారవుతారు. ఆస్తి పన్ను వసూలుకు వస్తున్న మున్సిపల్ సిబ్బందికి లేదంటే కార్యాలయంలో కాని చెల్లించాలి. అలాగే శతశాతం పన్ను వసూలయ్యే లా అధికారులు, సిబ్బంది చొరవ తీసుకోవాలి.

- ఆశ్రిత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, సిద్దిపేట



నేడు హుస్నాబాద్
బస్టాండ్ ప్రారంభం

- ప్రారంభించనున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆధునీకీకరించిన హుస్నాబాద్ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాన్ని గురువారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. బస్టాండ్ ఆధునీకరణకు మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.2 కోట్లు మంజూరు చేసి గత సంవత్సరం మార్చి 8న శంకుస్థాపన చేశారు. ఎట్టకేలకు పనులు పూర్తికావడంతో నేడు ప్రారంభించనున్నారు. అలాగే పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు కూడా మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

పోలీసులు శారీరక, మానసిక
దృఢత్వం కలిగి ఉండాలి

సంగారెడ్డి క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ సిబ్బంది శారీరక, మానసిక దృఢత్వాన్ని కలిగి ఉండడం కీలకమని సంగారెడ్డి రూపేష్ అన్నారు. ఈనెల 28వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్ కోసం సంగారెడ్డి నుంచి జట్ల ఎంపిక పోటీలను బుధవారం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని నాలుగు సబ్ డివిజన్, ఆర్మ్‌డ్ రిజర్వు విభాగాలకు లాంగ్ జంప్, హైజంప్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, లాగ్‌ఆఫ్‌వార్, షార్ట్ రన్ పోటీలను నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులలో పోలీసింగ్ అనేది చాలా సవాళ్లతో కూడినదన్నారు. అలాంటి చాలెంజ్ లను సమర్థవంతంగా ఎదుర్కొని, ప్రజలకు మెరుగైన సేవలు అందిచాలంటే దృఢంగా ఉండాలన్నారు.

అన్నాచెల్లెళ్ల మధ్య పదవి తెచ్చిన కయ్యం

- పదవి వీడగానే ఏకం.. వీడ్కోలు సభ ఉద్విగ్నం

దుబ్బాక, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఒకే పేగు పంచుకుని పుట్టిన అన్నాచెల్లెళ్ల మధ్య రాజకీయాలు కయ్యం పెట్టాయి. ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో ఇద్దరూ కౌన్సిలర్లుగా విజయం సాధించినా.. పక్కపక్కనే వార్డులు ఉండటంతో రాజకీయ వైరం మొదలైది. అది కాస్తా.. అన్నాచెల్లెళ్ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయికి చేరింది. కానీ, బుధవారం జరిగిన కౌన్సిల్ చివరి సమావేశం ఆ అన్నాచెల్లెళ్లను ఒక్కటి చేసింది. ఇద్దరూ ఉద్వేగానికి లోనై కళ్లలో నీళ్లు తిరుగుతుండగా, ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. దుబ్బాక మున్సిపాలిటీ పరిధి చెల్లాపూర్ (విలీనగ్రామం)లో గత ఎన్నికల్లో రెండు పక్క పక్క వార్డుల నుంచి అన్న మట్ట మల్లారెడ్డి స్వతంత్ర్య అభ్యర్థిగా, మరో వార్డు నుంచి దేవలక్ష్మి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. స్వతంత్ర్య అభ్యర్థిగా విజయం సాధించిన మట్ట మల్లారెడ్డి సైతం బీఆర్ఎస్‌లో చేరాలని అప్పట్లో ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఆయన బీజేపీలో చేరారు. అయితే, పక్కపక్కనే వార్డులు ఉండటంతో అభివృద్ధి విషయంలో పొరపొచ్చాలు వచ్చాయి. ఇద్దరి మధ్య విబేధాలు తారస్థాయికి చేరి, రాజకీయాలతో గ్రామంలో అభివృద్ధికి సైతం అడ్డంకులు ఏర్పడ్డాయి. అన్నాచెల్లెళ్ల మధ్య సయోధ్య కుదిర్చేందుకు పలువురు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. అయితే, నిన్న దుబ్బాక మున్సిపల్ ఛైర్‌పర్సన్ గన్నె వనితా రెడ్డి అధ్యక్షతన చివరి సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వీరిద్దరి మధ్య నెలకొన్న రాజకీయ వైరాన్ని ప్రస్తావిస్తూ ఉద్వేగానికి గురయ్యారు. బంధుత్వాలు బలపడాలే కానీ.. రాజకీయాల వల్ల విడిపోకూడదని సూచించారు. వెంటనే వైస్‌చైర్మన్ సుగుణ బాలకిషన్, కౌన్సిలర్లు ఆస యాదగిరి, ఇల్లెందుల శ్రీనివాస్, మీనా గౌడ్ లేచి మట్ట మల్లారెడ్డిని, ఆయన సోదరి దేవలక్ష్మిని ఒక్క దగ్గరికి చేర్చారు. దీంతో సమావేశం ఒక్కసారిగా ఉద్వేగానికి గురైంది. కళ్లలో నీళ్లు నింపుకుని ఆ అన్నాచెల్లెళ్లు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు.



దుబ్బాక మున్సిపల్ చివరి కౌన్సిల్ సమావేశంలో ఆత్మీయ ఆలింగనం చేసుకుంటున్న అన్నాచెల్లెళ్లు మల్లారెడ్డి, దేవలక్ష్మి

ఇంటర్
ప్రాక్టికల్స్‌పై నిఘా
- ప్రతీ ప్రయోగశాలలో సీసీ కెమెరాలు
- ఫిబ్రవరి 3 నుంచి పరీక్షలు

5

శోధిస్తూ.. సాధిస్తూ..
- సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల వినూత్న కార్యక్రమం
- 'జిజ్ఞాస' ప్రాజెక్టులో భాగంగా పరిశోధనలు
- రోజూ వాడే టూత్ బ్రష్‌పై రీసెర్చ్

5





వడ్రంగి పిట్ట
విన్యాసం

సిద్దిపేట గాడిచెర్లపల్లిలోని ఓ రైతు ఇంట్లో వడ్రంగి పిట్ట గూడు ఏర్పాటు చేసుకుంది. ఆహార అన్వేషణ కోసం బయటకు వచ్చినపుడు వడ్రంగి పిట్టలను చూడడం కనులవిందుగా ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జనవరి 22



నాచగిరి క్షేత్రంలో స్వాతి నక్షత్ర పూజలు

వర్గల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకుని బుధవారం స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ యాగశాలలో ఆలయ వేద పండితుల వేద మంత్రాల నడుమ హోమాధి కార్యక్రమాలు చేశారు. ఈ వేడుకలకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథ శర్మ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్‌లో నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత అందరి బాధ్యత అని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో కలిసి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జూనియర్ కళాశాల నుంచి రాందాస్ చౌరస్తా వరకు చేపట్టిన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించి, ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాణం చాలా విలువైందని, రోడ్డు భద్రతా నియమాలు ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి వెంకటస్వామి, డీఎస్పీ ప్రసన్నకుమార్, ఎంవీఐ విజయలక్ష్మి, ఏఎంవీఐలు శ్రీలేఖ, శ్రీనివాస్, ఎంఈవో నీలకంఠం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ శుక్రవారం మహిళల కోసం లైసెన్స్ మేళా

● జిల్లా రవాణా శాఖాధికారి వెంకటస్వామి

మెదక్ అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాలు, రానున్న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ప్రతీ శుక్రవారం మహిళల కోసం లైసెన్స్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా రవాణా శాఖాధికారి వెంకటస్వామి తెలిపారు. ఈ నెల 24 నుంచి మార్చి 8వ తేదీవరకు ప్రతి శుక్రవారం లైసెన్స్ మేళా ఉంటుందన్నారు. లెర్నింగ్ లైసెన్స్ కోసం స్లాట్ బుక్ చేసుకొని అవసరమైన ధ్రువపత్రాలు, పదో తరగతి మెమో, ఆధార్ కార్డు జిరాక్స్‌తోపాటు ఒరిజినల్స్ తీసుకొని కార్యాలయానికి రావాలన్నారు. 18 ఏళ్లు నిండి వాహనాలు నడిపే యువతులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ … అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల (same theatre list)

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ … అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల (same theatre list)


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు

ప్రజలను మభ్య పెట్టేందుకే గ్రామసభలు

● ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు

గుమ్మడిదల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : స్వార్థ రాజకీయాల కోసం ప్రజలను మభ్య పెట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తున్నదని ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు అన్నారు. బుధవారం గుమ్మడిదల మండల కేంద్రానికి వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలంటూ ఏకంగా ఆ పార్టీ ఎమ్మెల్యే ప్రకటించడంతోనే ప్రభుత్వానికి ప్రజలపై ఉన్న శ్రద్ధ ఎలాంటిదో తేటతెల్లమైందన్నారు. ప్రజాపాలనంటే ఇదేనా సీఎం అంటూ ప్రశ్నించారు. ఎన్నికల హామీ ఆరు గ్యారెంటీలను అమలు చేయలేని కాంగ్రెస్‌కు పాలించే నైతిక అర్హత లేదన్నారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీలపై కేసులు పెట్టి ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా బీఆర్ఎస్ ప్రజల అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, జిన్నారం వెంకటేశం గౌడ్, సీనియర్ నాయకులు దేవేందర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, సత్యనారాయణ, సూర్యనారాయణ, పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, తుపాకుల రాజు, ఆంజనేయులు యాదవ్, వాసు దేవ రెడ్డి, అమ్మగారి సదానందరెడ్డి, జైపాల్ రెడ్డి ప్రవీణ్ రెడ్డి, పెంటయ్య, శంకర్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఒడిశా బృందం


తూప్రాన్ ఆస్పత్రిలో వైద్య సేవల గురించి తెలుసుకుంటున్న ఒడిశా బృందం

తూప్రాన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఒడిశా బృందం సందర్శించింది. హైదరాబాద్‌కు చెందిన అనిల్‌కుమార్, పురుషోత్తం ఆధ్వర్యంలో సందర్శించి నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న పథకాల అమలును పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు, ఆరోగ్య శ్రీ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. తూప్రాన్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అమర్‌సింగ్ వారికి వైద్య సేవల తీరును వివరించారు. ఒడిశా బృందంలో వైద్యులు అరవిందిండా, గోవింద మహంతి, రాబి నారాయణ్ సాహు, ఇప్సితా మహపాత్ర, మనుశ్రీ, దీప్తి రాంకర్ మాలిక్, దీపక్ మాజీ తదితరులు పాల్గొన్నారు.

శోధిస్తూ.. సాధిస్తూ..

తమ చదువులో భాగంగా ప్రజలకు ఉపయోగపడే పరిశోధనలు, ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తున్నారు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు. జిజ్ఞాస అనే ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా విద్యార్థులు సబ్జెక్టులవారీగా పరిశోధన చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా బయో టెక్నాలజీ, మైక్రో బయాలజీ విద్యార్థులు ప్రజలకు మేలు కలిగించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వారు ఎంచుకున్న అంశానికి సంబంధించి శాంపిల్స్ సేకరించి పకడ్బందీగా పరిశోధన చేపడుతూ కొత్త విషయాలను కనుగొంటున్నారు. చిన్న చిన్న విషయాలను సైతం క్షుణ్ణంగా పరిశీలించి ఉత్తమ ఫలితాలను రాబడుతున్నారు. తాజాగా ఈ కళాశాల విద్యార్థులు టూత్ బ్రష్‌పై పెద్ద రిసెర్చే చేశారు. వంద శాంపిళ్లు సేకరించి పరిశీలించారు. బ్రష్ సరిగ్గా వాడకపోయినా, శుభ్రం చేయకపోయినా వాటి ద్వారా బాక్టీరియా వ్యాప్తి జరుగుతుందని గుర్తించారు. ఆ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేస్తున్నారు.

- సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల వినూత్న కార్యక్రమం
- 'జిజ్ఞాస' ప్రాజెక్టులో భాగంగా పరిశోధనలు
- రోజూ వాడే టూత్ బ్రష్‌పై రీసెర్చ్
- కనిపించిన బ్యాక్టీరియా.. నివారణ జాగ్రత్తలపై సూచనలు, సలహాలు

సిద్దిపేట కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మనం ప్రతీ రోజు ఉదయాన్నే నిద్రలేవగానే బ్రష్ చేసుకొందే దినచర్య ముందుకు కదలదు. సాధారణంగా బ్రష్ చేసుకోవడానికి టూత్ బ్రష్, టూత్‌పేస్టు మీదనే ఆధారపడతాం. పల్లెటూర్లలో కొంత మంది వేప పుల్లలు వినియోగిస్తారు. కానీ ఎక్కువగా టూత్ పేస్టు, టూత్ బ్రష్ ఎక్కువగా ఉపయోగిస్తారు. అయితే పళ్లను శుభ్రం చేసే టూత్ బ్రష్‌ను కూడా తరుచుగా శుభ్రం చేయాలని, లేకపోతే కొత్త సమస్యలు వస్తాయంటున్నారు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు. టూత్ బ్రష్ హైజీన్, శానిటైజేషన్ పద్ధతులపై వారు ఇటీవల అధ్యయనం చేపట్టారు. 100 టూత్ బ్రష్‌ల నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షలు నిర్వహించారు. అన్ని శాంపిల్స్‌లో స్టెప్టో కోకస్, స్టెఫైలకు, ఎస్చిషియాకూలి వంటి బాక్టీరియా వృద్ధి కనిపించింది. బాక్టీరియా వల్ల పలు దంత సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు,


బ్రష్‌పై అధ్యయనం చేసిన విద్యార్థులు, అధ్యాపకుడు

సలహాలు అందించారు. ఈ సమస్యలు రాకుండా ఉండటానికి తరుచుగా మనం వాడే టూత్ బ్రష్‌ను శానిటైజ్, లేదా వేడి నీళ్లతో శుభ్రం చేసుకోవాలని చెప్పారు. బ్రష్ చేసుకున్న వెంటనే కాసేపు ఎండలో పెట్టిన తర్వాత క్లోజర్‌తో ప్యాక్ చేసి పెట్టాలన్నారు. ప్రతి 3 నుంచి 4 నెలలకు ఒకసారి బ్రష్ మార్చాలని సూచిస్తున్నారు. బ్రష్ వాడకంపై ప్రజల్లో ఉన్న అవగాహన తెలుసుకోవడానికి సర్వే కూడా నిర్వహించారు. మైక్రోబయాలజీ విభాగధిపతి మదన్ మోహన్ పర్యవేక్షణలో జరిగిన ఈ సర్వేలో పాల్గొన్న జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్ విద్యార్థులు మౌనిక, సుస్మిత శరన్, సిద్ద, స్నేహ, నాగలక్ష్మిని ప్రిన్సిపాల్ సునీత, ఆధ్యాపక బృందం అభినందించింది.


పరిశోధన చేస్తున్న విద్యార్థినులు

అవగాహన అవసరం

చాలా మంది గొంతు, దంత సమస్యలతో బాధ పడుతుంటారు. వీటికి వివిధ కారణాలున్నప్పటికీ ముఖ్యమైన కారణం టూత్‌బ్రష్ అని తెలియదు. మా ప్రాజెక్ట్‌లో బాగంగా దాదాపు 500 మందితో ఇంట్రాక్ట్ అయ్యాం. అందులో 80 శాతం మంది బ్రషింగ్ అవగాహన లేదు. టూత్ బ్రష్‌ను ఎక్కడ పడితే అక్కడ పడేస్తుంటారు. బ్రషింగ్ తర్వాత కంటైనర్‌లో మాత్రమే పెట్టాలి. నెలల తరబడి బ్రష్‌లను వాడుతుంటారు. అలా చేయకూడదు. మౌత్ వాష్ కూడా తప్పనిసరిగా యూస్ చేయాలి.

-డా. మదన్ మోహన్, సూక్ష్మ జీవశాస్త్ర విభాగాధిపతి

ఈ ప్రాజెక్ట్ ద్వారా కొంత మార్పువచ్చినా చాలు

మనం నిత్యం పాటించే దినచర్యలో ఇదొక్క భాగం. చాలామందికి ప్రాపర్‌గా బ్రషింగ్ చేయటం తెలియదు. చిన్న విషయంగా కనిపించినా కూడా దంత సమస్యలు వస్తాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రజల్లో అవగాహన వస్తే మాకు సంతోషం. చాలా మందికి బ్రష్ చేసే విధానం తెలియదని మేం చేసిన సర్వేలో వెల్లడైంది. దీని వల్ల గొంతు, దంత సమస్యలు వస్తాయి. జాగ్రత్తలు పాటించకపోతే ఆనారోగ్య సమస్యలు వస్తాయి. మా ప్రాజెక్ట్ వల్ల అవేర్‌నెస్ వస్తే బాగుంటుంది.

-మౌనిక, సుస్మిత, విద్యార్థినులు

చెరకు పంట, లారీ దగ్ధం


కాలి బూడిదగా మారిన చెరకు పంట

జహీరాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని ఇప్పెపల్లిలో మంగళవారం జరిగిన షార్టుసర్క్యూట్‌తో 40ఎకరాల్లో చెరకుపంట కాలిపోయిన ఘటన మరువక ముందే బుధవారం అదే మండలంలోని గౌసాబాద్‌కు చెందిన సంజీవరెడ్డి అనే రైతు తన పొలంలో గల చెరకు పంటను లారీలో నింపుతున్న క్రమంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పొలంలో విద్యుత్ తీగలు వేలాడుతూ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో లారీ, చెరకు, డ్రిప్‌పైపులు కాలిపోయాయి. రూ.10లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తంచేశారు. పొలాలపై వేలాడుతున్న తీగలను తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని, ఈ ప్రమాదాలకు వారే కారణమని, బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

రూ.94లక్షల విలువైన మత్తుపదార్థాలు ధ్వంసం

నర్సాపూర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని ఆయా ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఎండుగంజాయి, డైజోఫాం, ఆల్ప్రాజోలం తదితర మత్తు పదార్థాలను అధికారులు ధ్వంసం చేశారు. రూ.94లక్షల విలువగల వాటిని బుధవారం నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్ సమీపంలోని బయో పరిశ్రమలో ధ్వంసం చేశారు. అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మెదక్, రామాయంపేట, నర్సాపూర్ ఎక్సైజ్ సీఐలు నాగేశ్వరరావు, రాణి, పద్మ, ఎస్ఐలు రాజేష్, మాన్సింగ్, రాఘవేందర్‌రావు, అరుణ తదితరులు పాల్గొన్నారు.


మత్తుపదార్థాలను ధ్వంసం చేస్తున్న అధికారులు



రావి ఆకుపై సుభాష్ చంద్రబోస్ చిత్రం

నారాయణఖేడ్, జనవరి 22(ఆంధ్రజ్యోతి):ఈ నెల 23న నేతాజి సుభాష్ చంద్రబోస్ జయంతి ఉంది. దీన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్ పట్టణానికి చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్ రావి ఆకుపై చంద్రబోస్ చిత్రాన్ని ఆకట్టుకునే విధంగా వేసి పలువురిని అబ్బుర పరిచాడు.

ఒక్కరే విద్యార్థి.. ఒక్కరే ఉపాధ్యాయుడు

● గౌడ్‌గాం జన్‌వాడ పాఠశాలను తనిఖీ చేసిన మండల ప్రత్యేక అధికారి

నాగల్‌గిద్ద, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గౌడ్‌గాం జన్‌వాడ ప్రాథమిక పాఠశాలను బుధవారం మండల ప్రత్యేక అధికారి బలరాం, ఇన్‌చార్జి తహసీల్దార్ శివక్రిష్ణ స్థానిక ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఒక్కరే విద్యార్థి, ఒక్కరే ఉపాధ్యాయుడు ఉండటంతో అధికారులు ఆశ్చర్యపోయారు. స్థానిక ఉపాధ్యాయులను అధికారులు అడుగగా గ్రామంలో విద్యార్థులు లేరని తెలుపడంతో అధికారులు ఆశ్చర్యపోయారు. దీంతో అధికారులు మాట్లాడుతూ గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కాగా కేశ్వార్‌లో గల ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో మన్మథకిషోర్ తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.


పాఠశాల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి

క్రైం కార్నర్

పరిశ్రమలో ఊపిరాడక కార్మికుడి మృతి


మనోజ్ మృతదేహం

జిన్నారం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో ఊపిరాడక కార్మికుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గడ్డపోతారంలో నివాసం ఉండే ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మనోజ్ (28) ఈ నెల 21న స్థానికంగా ఉన్న లీఫార్మా పరిశ్రమలో మధ్యాహ్నం (బి షిఫ్ట్) విధులకు వెళ్లాడు. రాత్రి 8:30గంటల ప్రాంతంలో పనిలో ఉండగా ఊపిరాడక అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన పరిశ్రమ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి తన నివాసం వద్ద దింపి వెళ్లారు. రాత్రి 10గంటల సమయంలో తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబసభ్యులు సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా.. మృతి చెందాడు. మృతుడి సమీప బంధువు చంద్రకేశవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్‌రెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు..

దుబ్బాక,జనవరి22(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిన్ననిజాంపేట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రంజిత్(33) మంగళవారం సాయంత్రం పోతరెడ్డిపేట పెద్దవద్ద కాళ్లకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో కాలుజారి చెరువులో పడి మృతిచెందాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకగా చెరువు వద్ద బైక్, చెప్పులు కనబడ్డాయి. సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తును చేస్తున్నారు.

వంటమనిషి ఆత్మహత్య

ఐడీఏబొల్లారం జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఒంటరితనాన్ని భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిస్సా ప్రాంతానికి చెందిన బాస్కర్‌రావు (36) బొల్లారంలో నివాసం ఉంటూ బాలాజీ హోటల్‌లో వంటమనిషిగా పని చేస్తున్నారు. కుటుంబ సభ్యులను వదిలి ఒంటరిగా నివాసం ఉంటున్న అతడు మద్యానికి బానిసగా మారారు. కుటుంబంతో పెద్దగా సంబంధాలు లేకపోవడంతో తీవ్రమనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బాబాయ్ బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆగని హైనా దాడులు

ధూళిమిట్ట, జనవరి22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూటిగల్ గ్రామంలో పశువులపై హైనా దాడులు ఆగడం లేదు. మంగళవారం రాత్రి వ్యవసాయ బావి వద్ద పొన్నం రాజుకు చెందిన గేదె దూడపై హైనా దాడి చేయడంతో మృతిచెందింది. బుధవారం ఉదయం గమనించిన రైతులు అధికారులకు సమాచారం అందించగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాముడు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. రాత్రి వేళల్లో పశువులను ఇళ్ల వద్ద కట్టేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

మల్లన్నను దర్శించుకున్న టీజీఎస్‌పీడీసీఎల్ సీజీఎం

చేర్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయాన్ని బుధవారం టీజీఎస్‌పీడీసీఎల్ సీజీఎం సాయిబాబా సందర్శించారు. ఈ సందర్భంగా మల్లన్నను దర్శించుకుని అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు స్వామివారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌పై నిఘా

● ప్రతీ ప్రయోగశాలలో సీసీ కెమెరాలు
● ఫిబ్రవరి 3 నుంచి పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను ఈ సారి మరింత పకడ్బందీగా నిర్వహించడంపై తెలంగాణ ఇంటర్ బోర్డు దృష్టి సారించింది. ఫిబ్రవరి 3 నుంచి 20 రోజుల పాటు జరిగే ఈ పరీక్షలపై నిఘాను పటిష్టం చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సీసీ కెమెరాల నిఘాలో ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నది. ఈ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య జిల్లాల్లోని ఇంటర్మీడియట్ అధికారులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు కూడా జారీ చేశారు.


కమాండ్ కంట్రోల్‌కు కెమెరాల అనుసంధానం

ప్రాక్టికల్స్ నిర్వహించే గదుల్లో రెండేసి చొప్పున వీడియోతో పాటు వాయిస్ రికార్డింగ్‌తో కూడిన సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు. ఈ కెమెరాలను ఇంటర్ బోర్డులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయనున్నారు. ఉన్నతాధికారులు ఇక్కడి నుంచే పరీక్షల నిర్వహణను పర్యవేక్షించనున్నారు. జిల్లాలో సుమారు 10 వేల మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతారు. ప్రశ్నాపత్రం



ఏ రోజుకారోజు ప్రిన్సిపాల్ లాగిన్‌కు మెయిల్‌లో వస్తుండగా.. దాన్ని సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రింట్ తీసుకొని విద్యార్థులకు అందిస్తారు. అక్రమాల నిరోధానికి మునుపెన్నడూ లేని విధంగా ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ నేపథ్యంలో పలు కళాశాలల యాజమాన్యాలు ఆగమేఘాల మీద సీసీ కెమెరాల బిగింపు, ప్రాక్టికల్ పరికరాలు, రసాయనాలు తెప్పించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

బోర్డు ఆదేశాలు పాటించాల్సిందే



ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలపై ఈ సారి బోర్డు అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ కళాశాలలెవరైనా ప్రతీ ల్యాబ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందే. ప్రతీ సీసీ కెమెరాపై బోర్డు ఉన్నతాధికారుల నిఘా ఉంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాలను ప్రతి కళాశాల యాజమాన్యాలు పాటించాలి.

-గోవిందరామ్, డీఐఈవో, సంగారెడ్డి

131 జూనియర్ కళాశాలలు

సంగారెడ్డి జిల్లాలో మొత్తం 131 జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో 20 ప్రభుత్వ, 48 ప్రైవేటు, 63 ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాలలున్నాయి. వీటన్నింటిల్లో విధిగా సీసీ కెమెరాలు అమర్చాల్సి ఉంది. ఇప్పటికే గత డిసెంబరు నెలలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణలో బాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరికరాలు, రసాయనాలు కొనగోలుకు ఒక్కో కళాశాలకు రూ.25 వేల చొప్పున మంజూరయ్యాయి. అదేవిధంగా ప్రతీ కళాశాలకు సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 12 వేల నిధులు కూడా కేటాయించింది. ఇక కొన్ని జూనియర్ కళాశాలల్లో ఇంటర్ బోర్డు అధికారులే సీసీ కెమెరాల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

వైద్య సేవల్ని విస్తృత పర్చాలి: డీఎంహెచ్‌వో

మద్దూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల పరిధిలో వైద్యసేవలు విస్తృత పర్చాలని, ప్రభుత్వ పథకాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సిద్దిపేట జిల్లా డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్ సూచించారు. బుధవారం మద్దూరు మండల కేంద్రంతో పాటు లద్నూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో పరిస్థితులపై ఆరా తీశారు. పలు రిజిస్టర్లను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే వారికి నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో నారాయణరావు, డాక్టర్ రజిత, సీహెచ్‌వో ప్రకాష్, నర్సింగ్ ఆఫీసర్ మాధవి, పార్మసిస్ట్ సందీప్ ఉన్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన హరీశ్‌రావు



ఉమేష్ చంద్రను పరామర్శిస్తున్న హరీశ్‌రావు

చిన్నకోడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు గ్రామ మాజీ సర్పంచ్ కాముని ఉమేష్ చంద్రకు ఇటీవల గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్స జరిగింది. మాజీ మంత్రి హరీశ్‌రావు బుధవారం ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి వెంట టీఎస్ఎంఎస్ఐడీసీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య తదితరులు ఉన్నారు.

రేణుకాఎల్లమ్మ సన్నిధిలో.. అనివేటి మండపం పూర్తయ్యేదెన్నడో?





ఆలయంలో కొలువైన రేణుకా ఎల్లమ్మదేవి, స్లాబ్ దశలో ఉన్న అనివేటి మండప నిర్మాణం

- గత ప్రభుత్వ హయాంలో రూ.50 లక్షలు మంజూరు
- ప్రారంభించి 9నెలలైనా నేటికీ స్లాబ్ దశలోనే పనులు
- ఏటేటా పెరుగుతున్న భక్తుల రద్దీ
- జాతరకు ముందే పూర్తి చేయాలని భక్తుల డిమాండ్

హుస్నాబాద్ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతరకు సమయం ముంచుకొస్తుంది. కాని ఆలయానికి ప్రధానమైన అనివేటి మండప నిర్మాణ పనుల పట్ల నిర్లక్ష్యం చర్చనీయాంశంగా మారింది. మే 12నుంచి నెల రోజుల పాటు జాతర జరుగనుండటంతో పనులు త్వరగా పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు. గత ప్రభుత్వ కాలం నుంచి ఈ పనులు ఆగుతూ.. సాగుతున్నాయి.

రెండుసార్లు శంకుస్థాపనలు చేసినా..

ఎల్లమ్మ జాతరకు ఏటేటా భక్తుల రద్దీ పెరుగుతుండటంతో పురాతనమైన మండపాన్ని తొలగించి దాని స్థానంలో అధునాతనంగా అనివేటి మండపాన్ని నిర్మించాలని యోచించారు. దీనికి రూ. 50లక్షలు మంజూరు చేశారు. 19 డిసెంబరు 2022న అప్పటి ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. టెండరు ప్రక్రియ కూడా పూర్తయ్యింది. స్టీల్ డిజైన్, సాయిల్ టెస్ట్ వంటివి పూర్తయిన అనంతరం పనులు నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 మార్చి 13న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ప్రస్తుతం స్లాబ్ దశలో పనులు జరుగుతున్నాయి. 9నెలలు గడిచినా ఇంకా పనులు పూర్తి కాకపోవడంతో జాతరలోపు పనులు పూర్తయ్యేనా అని భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఏటా రెండు లక్షల మందికి పైగా దర్శనం

హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మదేవిని ఏటా దాదాపు రెండు లక్షల మందికి పైగా భక్తులు దర్శించుకుంటారు. ప్రతీ సంవత్సరం వైశాఖ పౌర్ణమి నుంచి జేష్ఠ పౌర్ణమి వరకు నెల రోజుల పాటు ఎల్లమ్మ జాతర పెద్దఎత్తున నిర్వహిస్తారు. జాతరకు హుస్నాబాద్ చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా మహరాష్ట్రలోని చంద్రాపూర్, షోలాపూర్, బీదర్, హైదరాబాద్, నిజామాబాద్, జనగామ, మెదక్, సంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, జగిత్యాల,పెద్దపల్లి, భువనగిరి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై మొక్కులు సమర్పించుకుంటారు.

మరో పక్షం రోజుల్లో ప్రహరీ పూర్తి

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రేణుకా ఎల్లమ్మ ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం రూ. 85 లక్షలు మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. మరో 15 రోజుల్లో ఈ పనులు పూర్తవుతాయి. అలాగే భక్తుల సహకారంతో ఆలయం వద్ద ఆరు షట్టర్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నారు. జాతరలోపు ఇవి కూడా పూర్తయ్యే అవకాశాలున్నాయి.

మొక్కులు తీర్చుకునేందుకు ఇక్కట్లు తప్పవా?

ఆలయంలో అమ్మవారికి బోనాలు, సంతానం కోసం దంపతులు కొబ్బరికాయల ముడుపులు కట్టడం, పట్నాలు వేయడం, గండాలు తొలగాలని గండదీపం వెలిగించడం వంటి కార్యక్రమాలన్నీ ఆలయ అనివేటి మండపంలో చేస్తారు. మండపం చిన్నదిగా ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆగమ శాస్త్రం ప్రకారం పాత మండపాన్ని తీసివేసి నూతనంగా అనివేటి మండపాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం స్లాబ్‌ల నిర్మాణం చేయగా ఇంకా శిల్పులతో విగ్రహాలు, రంగులు, ఇతర పనులు చేయాల్సి ఉంది. మరో నాలుగు నెలల్లో జాతర ప్రారంభమవుతుంది. అప్పటి లోగా ఈ పనులు పూర్తి చేయాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడి దుర్మరణం

వర్గల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలం గౌరారం రాజీవ్ రహదారిపై బుధవారం బైక్ ఢీకొట్టిన ఘటనలో గుర్తుతెలియని వృద్ధుడు(60) దుర్మరణం చెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. పూర్తి వివరాల కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



సాయిలు(ఫైల్)

గజ్వేల్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ బలవన్మరణం చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని పిడిచెడ్ గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నీల సాయిలు(49)కు అప్పులపాలై తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు వెంటనే గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో దొంగకు రిమాండ్



వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌ఐ

వర్గల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తిని గౌరారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. బుధవారం గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మీనాజీపేట గ్రామంలో కొద్ది రోజుల క్రితం లక్ష్మీ అనే మహిళ ఇంటి తాళం వేయగా ఆ ఇంట్లో చోరీ జరిగింది. అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం అనుమానస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని పట్టుకుని విచారించగా మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కేంద్రానికి చెందిన సిరిగిరి నర్సింలుగా గుర్తించారు. రాత్రి సమయంలో ఇంటి తాళం ధ్వంసం చేసి చోరీకి పాల్పడినట్లు అంగీకరించడంతో అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి.. ఆరుగురి అరెస్ట్

వర్గల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నెంటూర్ గ్రామ శివారు ప్రాంతంలోని వ్యవసాయ షెడ్డు వద్ద పేకాడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం కొంతమంది పేకాడుతున్నట్టు సమాచారమందుకున్న సిద్దిపేట టాస్క్ ఫోర్స్, బేగంపేట పోలీస్‌స్టేషన్ పోలీసులు పేకాటస్థావరంపై దాడి చేశారు. ఈ సందర్భంగా ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 10680 నగదుతో పాటు 6 మొబైల్ ఫోన్‌ల , 3బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

ప్రజాసేవకు విరామం ఉండదు: దుబ్బాక ఎమ్మెల్యే

- దుబ్బాక, చేర్యాలలో మున్సిపల్ పాలకవర్గాల చివరి సమావేశాలు



దుబ్బాక మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి



చేర్యాల మున్సిపల్ సమావేశంలో చర్చిస్తున్న చైర్‌పర్సన్ స్వరూపారాణి, కమిషనర్ నాగేందర్

సిద్దిపేట, జనవరి22(ఆంధ్రజ్యోతి): ప్రజాసేవకు విరామం, వీడ్కోలు ఉండదని.. ప్రజలిచ్చి అవకాశాన్ని మరింత పెంచుకుని, ఉన్నతమైన సేవలందించే స్థాయికి ఎదుగగలుగుతామనీ దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం దుబ్బాక పురపాలిక చివరి కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దుబ్బాక అభివృద్ధికి పాలకమండలి చేసిన సేవలు మరువలేనివన్నారు. కరోనా సమయంలో ప్రతికూల పరిస్థితుల్లోనూ దుబ్బాక అభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. దుబ్బాక అభివృద్ధికి తనతోపాటు ఐదేళ్లపాటు కలిసి పనిచేసిన దుబ్బాక మున్సిపల్ పాలకమండలి సహకారం మరవలేనిదన్నారు. ఈనెల 28న ప్రారంభం కానున్న రామేశ్వరంపల్లి కూడవెల్లి రామలింగేశ్వరం జాతర ఏర్పాట్ల పనులను బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే పరిశీలించారు. దుబ్బాక ఎమ్మెల్యేకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తదితరులున్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పోతారం గ్రామంలో వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చేర్యాలలో సాదాసీదాగా...

చేర్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మునిసిపల్ పాలకమండలి చివరి సాధారణ సమావేశం బుధవారం సాదాసీదాగా జరిగింది. ఈసందర్భంగా బుధవారం మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కమిషనర్ నాగేందర్, కౌన్సిలర్లు పట్టణాభివృద్ధి, మౌళిక వసతుల కల్పన చర్యల పై చర్చించి పలు తీర్మాణాలను ఆమోదించారు. అనంతరం తమ ఐదేళ్ల పాలనపై చర్చించారు. మునిసిపల్ పాలక మండలి పదవీకాలం మరో రెండు, మూడురోజుల్లో ముగియనుండగా చివరి సమావేశం నామమాత్రంగా జరపడం చర్చనీయాంశంగా మారింది.

వాహనదారులు ట్రాఫిక్ నియమాలను విధిగా పాటించాలి



సిద్దిపేట జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న రవాణా శాఖ అధికారులు సిబ్బంది

సిద్దిపేట క్రైం/గజ్వేల్/నంగునూరు/చేర్యాల/వర్గల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి బుధవారం జిల్లావ్యాప్తంగా వాహనదారులు, ఆటో డ్రైవర్లు, ప్రజలకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రహదారిపై వాహనాలు నడిపేటప్పుడు రోడ్డుభద్రతా నియమాలు పాటించాలని, టూ వీలర్ వాహనదారులు హెల్మెట్‌ను, ఫోర్ వీలర్ నడిపే వాహనదారులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. సిద్దిపేట జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో సిద్దిపేట మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నారాయణ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. ప్రమాదాల నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యతగా అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. గజ్వేల్ పట్టణంలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రం ఎదుట ప్రజలకు, వాహనదారులకు గజ్వేల్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ క్రిష్టోఫర్ ట్రాఫిక్ నియమ, నిబంధనలు, రోడ్డు భద్రతా నియమ, నిబంధనలను గూర్చి వివరించారు. ప్రజ్ఞాపూర్‌లోని చౌరస్తాలో రాణే బ్రేక్ లైనింగ్స్ లిమిటెడ్ పరిశ్రమవారి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ సెఫ్టీ అవగాహన సదస్సులో ట్రాఫిక్ సీఐ మురళి వాహనదారులకు అవగాహన కల్పించారు. నంగునూరు మండలం సిద్దన్నపేటలో రాజగోపాలపేట ఎస్‌ఐ మహ్మద్ ఆసిఫ్ ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. చేర్యాలలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రిష్టోఫర్ లారీ డ్రైవర్లకు రోడ్డుభద్రత నియమాలు, చర్యలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎంవీఐ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. వర్గల్ మండలం అంబర్‌పేటలో గౌరారం ఎస్‌ఐ కరుణాకర్ రెడ్డి ప్రజలకు రోడ్డుభద్రత అవగాహన కల్పించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 46 మందికి జరిమానా.. ఒకరికి జైలు

సిద్దిపేట క్రైం/గజ్వేల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్ పట్టణాల్లోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 46మంది పట్టుబడ్డారు. బుధవారం కోర్టులో హాజరుపరచగా వారికి రూ.79,500 జరిమానా విధించారు. అందులో ఒకరికి జైలు విధించారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట లోని ట్రాఫిక్ పోలీసులు, టూ టౌన్ పోలీసులు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వాహన తనిఖీల్లో 27 మంది మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా, విచారణ అనంతరం 27 మందికీ రూ.64,500 జరిమానా విధించారు. వారిలో ఒకరికి 3 రోజుల జైలు శిక్ష విధించారు. గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో 19 మంది వాహనదారులు మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట హాజరు పరచగా విచారణ అనంతరం రూ.15వేలు జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించినట్లు తెలిపారు.

షీ టీమ్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన

ధూళిమిట్ట,జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు బుధవారం పోలీసులు షీటీమ్ పనితీరుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని లక్ష్యం దిశగా ముందుకు సాగాలన్నారు. సోషల్‌మీడియాలో వచ్చే వాటికి ఆకర్షితులై, అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ రెడ్డి, ఏఎస్‌ఐ విజయ్‌కుమార్,షీటీమ్ పోలీసులు,తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'సంవిధాన్ గౌరవ్ అభియాన్'



కుకునూరుపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు

కుకునూరుపల్లి/మద్దూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి, మద్దూరు మండల కేంద్రాల్లో బీజేపీ ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని వేర్వేరుగా నిర్వహించారు. కుకునూరుపల్లిలో మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ జిల్లా కుడిక్యాల రాములు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు నత్తి శివకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయ సాధన కోసం మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని, తెలిపారు. మద్దూరులో బీజేపీ రాష్ట్ర నాయకుడు అంకుగారి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ ప్రధాని రాజ్యాంగాన్ని గౌరవిస్తూ సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. దళితుల అభ్యున్నతికి బీజేపీ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతనిస్తుందన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పరామర్శ

చిన్నకోడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు మండలం మైలారం గ్రామానికి చెందిన డీసీసీబీ ఉమ్మడి మెదక్ జిల్లా డైరెక్టర్, మాజీ ఎంపీపీ నముండ్ల రామచంద్రం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, టీఎస్ఎంఎస్ఐడీసీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ బుధవారం వేర్వేరుగా రామచంద్రం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

రెండో రోజూ అదే తీరు



సిద్దిపేట అర్బన్: .పొన్నాలలో పథకాల గురించి మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

(3వ పేజీ తరువాయి)

చెదరగొట్టారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఇరువురు దూషణల మధ్య చేర్యాల మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు ఇరువురు చొక్కాలు పట్టుకున్నారు. ఈ క్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్‌పై బీఆర్ఎస్ నాయకుడు చేయి చేసుకున్నాడు. దీంతో పోలీసులు ఇరవురిని శాంతింపజేసే ప్రయత్నం చేసినా ఎవరూ వినకపోవడంతో ఇరువర్గాలను చెదరగొట్టారు. దీంతో అక్కడ నుంచి బీఆర్ఎస్ నాయకులను సభా సమావేశం స్థలం నుంచి పంపించేశారు. సమావేశం రసాభాసగా మారడంతో ముందే అధికారులు సమావేశం నుంచి భయంతో వెళ్లిపోయారు.

రసాభాసగా సభలు

- సిద్దిపేట రూరల్ మండలంలో నిర్వహించిన గ్రామసభలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేశారు.
- తొగుట మండలం తుక్కాపూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ భార్య లలితకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో పేరు రావడంతో, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు లింగాల కృష్ణ భార్య కవితకు కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించడంతో అధికారులపై గ్రామస్థులు మండిపడ్డారు.
- సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలోఅధికారులపై గ్రామస్థులు వాగ్వాదానికి దిగారు. మిట్టపల్లి గ్రామసభ లో గ్రామస్థులు అధికారులపై దూసుకెళ్లడంతో సభను మధ్యలోనే ఆపేశారు.
- ధూళిమిట్ట మండలం తోర్నాలలో తమ పేర్లు రాలేదని పలువురు అధికారులను నిలదీశారు.
- దుబ్బాక మండలం గంభీర్‌పూర్‌లో వ్యవసాయ భూములు ఉన్న వారికి ఆత్మీయ భరోసా వచ్చిందని, భూములు లేని వారి పేర్లు జాబితాలో రాలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. జాబితాలో వచ్చిన పేర్లలో తల్లిదండ్రుల పేర్ల భూములున్నాయి.
- మద్దూరు మండలం ధర్మారం, లద్నూరు గ్రామాల్లో ఇళ్లు, రేషన్‌కార్డుల జాబితాలో పేర్లు రాలేదని కొందరు అధికారులతో గొడవ పడ్డారు. లద్నూరులో తహసీల్దార్ సమావేశం నుంచి లేచి వెళ్లిపోయారు. పేర్లు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
- అర్హులకు రేషన్‌కార్డులు మంజూరు చేయకపోవడం, రుణమాఫీ అమలు చేయకపోవడం తగదంటూ చేర్యాల మండలం చుంచనకోట గ్రామసభలో సీపీఎం నాయకుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు.
- కొమురవెల్లి మండలం అయినాపూర్‌లో అనర్హుల పేర్లు లబ్ధిదారుల జాబితాలో రావడంపై సీపీఎం, స్థానికులు, ఆగ్రహం వ్యక్తం చేశారు.
- తీగుల్‌లో నిర్వహించిన గ్రామసభలో ఆత్మీయ భరోసా పథకం భూమిలేని వారందరికీ ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు చేసుకున్న అందరికీ ఇవ్వాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.



తొగుట: తుక్కాపూర్ గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగులకు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు పథకాల వర్తింపుపై గొడవ

- బెజ్జంకి మండలం పలుగ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో రేషన్‌కార్డులు, రుణమాఫీపై ఇందిరమ్మ ఇళ్ల జాబితాలపై గ్రామస్థులు అధికారులను నిలదీశారు.
- దౌల్తాబాద్ మండల పరిధిలోని ముబ్బరాస్‌పూర్ గ్రామంలో ఉపాధి జాబ్‌కార్డు లేని వాళ్లకు, భూమి ఉన్న వాళ్లకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో పేర్లు వచ్చిన వాళ్లకు గ్రామ ప్రజలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారులు నచ్చజెప్పి పేర్లురాని వాళ్ల దరఖాస్తులను స్వీకరించారు.
- రాయపోల్, అంకిరెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో గందరగోళం నెలకొన్నది. జాబితాలో అనర్హుల పేర్లున్నాయని, భూమిలేని పేదల పేర్లు రాలేదని అధికారులను నిలదీశారు.
- నంగునూరు మండలంలోని రాజగోపాలపేట ఘనపూర్ గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల ఎంపికలో అర్హులైన వారి పేర్లు లేవంటూ గ్రామస్థులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
- చిన్నకోడూరు మండలంలోని చంద్లాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో అనర్హులను ఎంపిక చేశారని అధికారులను గ్రామస్థులు నిలదీశారు.
- గజ్వేల్ మండల పరిధిలోని బయ్యారం, దాతర్‌పల్లి, కొల్గూర్‌లలో గ్రామసభ రసాభాసగా జరిగింది. అధికారులు ఫ్లెక్సీ పైన ఎమ్మెల్యే ఫొటో పెట్టకపోవడంతో బీఆర్ఎస్ నాయకులకు అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. అనర్హులకు ఇల్లు కేటాయించారని ఎంపీడీవోపై మండిపడ్డారు.

లబ్ధిదారుల జాబితాలో ప్రభుత్వ ఉపాధ్యాయులు

చేర్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మునిసిపల్ 4వ వార్డు పరిధి జాబితాలో ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డు మంజూరుకు సంబంధించి ప్రభుత్వ ఉపాధ్యాయుల పేర్లు రావడం చర్చనీయాంశమైంది. స్థానిక రైతుబజారులో బుధవారం వార్డు సభ నిర్వహించగా లబ్దిదారుల జాబితాను అధికారులు ప్రస్తావించారు. అందులో ఇరువురు ప్రభుత్వఉపాధ్యాయుల పేర్లురావడంతో పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదానికి దారి తీసింది.

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి పునరావాసం కల్పించాలి

చిన్నకోడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ చిన్నకోడూరు మండలం చెల్కలపల్లి గ్రామస్థులు బుధవారం ఎల్లాయిపల్లి శివారులోని అదనపు టీఎంసీ పంప్ హౌజ్ వద్ద ఆందోళన చేపట్టారు.

మా ప్యాకేజీలు ఎప్పుడిస్తారు?

గజ్వేల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మా ప్యాకేజీలు, పరిహారాలు ఎప్పుడిస్తారని మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన పల్లెపహాడ్ గ్రామసభలో అధికారులను ప్రజలు ప్రశ్నించారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభ లో గ్రామానికి చెందిన పలువురు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, పరిహారం, ప్యాకేజీ, ఒంటరి మహిళలకు ప్లాట్ల కేటాయింపు, యువకులకు ప్లాట్ల కేటాయింపు గూర్చి ప్రశ్నించారు.

ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలి?: హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, జనవరి22(ఆంధ్రజ్యోతి): ప్రజలు రేషన్‌కార్డుల కోసం ఎన్నిసార్లు ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట పట్టణంలోని 15వ వార్డులో నిర్వహించిన వార్డు సభకు హరీశ్‌రావు హాజరుకాగా రైతులు తమకు రుణమాఫీ జరగలేదంటూ ఆయన ముందు గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం మాజీమంత్రి మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ప్రతీసారి రూ.40 చొప్పున ఖర్చవుతున్నదని మండిపడ్డారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు వంటి పథకాలందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బేటీ బచావో బేటీ పడావో పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనూ చౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో బేటీ బచావో బేటీ పడావో పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ మను చౌదరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, సూపరింటెండెంట్ విజిత, జిల్లా మహిళా సాధికారత కేంద్రం మిషన్ కోఆర్డినేటర్ వాసవి, సిబ్బంది ఉన్నారు.

భార్గవ్‌కు సీపీ అభినందన



భార్గవ్‌ను అభినందిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేట కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో 2వ ర్యాంకు సాధించిన ఇర్కోడ్ తెలంగాణ మోడల్ స్కూలు విద్యార్థి భార్గవ్‌ను సీపీ అనురాధ అభినందించారు. బుధవారం సిద్దిపేటలోని కమిషనర్ కార్యాలయంలో భార్గవ్, పాఠశాల అధ్యాపక బృందం, భార్గవ్ తల్లి సీపీని కలిశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆంజనేయులుకు జపాన్ కరాటే ఇంటర్నేషనల్ డిప్లొమా

జగదేవ్‌పూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జగ దేవ్‌పూర్‌కు చెందిన రాచకొండ అంజనేయులు కరాటేలో జపాన్ కరాటే ఇంటర్నేషనల్ డిప్లొమాను అందుకున్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇంటర్నేషనల్ ట్రైనింగ్ క్యాంపులో ఈ డిప్లొమాను అందుకున్నారు. జపాన్ కరాటే గత 25 సంవత్సరాలుగా ఎంతో మంది విద్యార్థినీ, విద్యార్థులకు కరాటేను పరిచయం చేసి, దాదాపు 40 మంది బ్లాక్ బెల్టర్లను తయారు చేసినందుకు అంజనేయులు ఈ డిప్లొమాకు ఎంపికయ్యారు. అమెరికా, న్యూజిలాండ్, జపాన్, శ్రీలంక, థాయిలాండ్, ఆస్ట్రేలియా తదితర దేశాల నుంచి దాదాపు 1500 మంది బ్లాక్ బెల్ట్ మాస్టర్స్, విద్యార్థులు ఈ క్యాంపులో పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా నుండి రాచకొండ అంజనేయులు, రామిని భాగ్య రాజులకు ఇంటర్నేషనల్ డిప్లొమా, మెమొంటోను హిరయామాశిహన్, హిరోసి సెన్సయ్ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో ఇముర శిహన్, తనియమ శిహన్, ఇండియా చీఫ్ ఆనందరత్న శిహన్, జపాన్ కరాటే అసోసియేషన్ తెలంగాణ ప్రధాన శిక్షకులు రాపోలు సుదర్శన్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ దయానంద్‌కుమార్, కరాటే విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.